# అది సమస్య - ఇది పరిష్కారం

## సింగరాజు రామచంద్రమూర్తి

పందిట్లో ఒక మూలగా కూర్చున్నాడు గోపాలరావు. అతనికి అక్కడ జరుగుతున్న సంరంభంతో ఎటువంటి సంబంధం లేనట్లుగా ఉంది. అల్లకల్లోలంగా ఉన్న సముద్రం మధ్యనగల ప్రశాంతమయిన దీవిలో ఉన్నట్టున్నాడతను.

ఎందుకంటే అతని చేతిలో పుస్తకం ఉందికనుక. వస్తూవస్తూ— ఎరుగున్న వారుంటారు ఉండకపోతారన్న భయంతో స్నేహితుడి లాగా ఉంటుందని కొనుక్కున్నాడతను ఆ పుస్తకాన్ని. తీరాఇక్కడికివచ్చేసరికి ఆ పుస్తకం చదవటానికి ఎక్కడ అవాంతరం కలుగుతుందోనని అందర్నీ తప్పించుకునేందుగ్గాను ఇలా మూలగా కూర్చుని అందులో లీనమయాడు.

అతనికి దూరంగా కొందరు కబుర్లు చెప్పుకుంటున్నారు. రాత్రి తెల్లవార్లు నిద్రలు లేకుండా మేలుకుని ఉండటంవల్ల పందిట్లో కుర్చీలలో కూర్చునే జోగుతున్నారు మరికొందరు.

గబగబ వచ్చింది జానకి. వస్తూనే "నేను చెప్పలేదుటండీ, మా మావయ్య అందరికీ దూరంగా ఒక మారుమూల స్థలంలో కూర్చుని ఉంటాడు. చేతిలో ఒక ఇంగ్లీషు పుస్తకం ఉంటుంది. మనం దగ్గరకి వెళ్ళగానే ఉలిక్కిపడి తలెత్తుతాడు" అని అంది పక్కనున్నతనితో.

ఉలిక్కిపడి తలెత్తిన గోపాలరావు నవ్వాడు.


"నిజం మావయ్యా. నా పరువు దక్కించావు. ఏ మాత్రం నీ పద్ధతులు మార్చుకున్నా ఈయన ముందు సిగ్గుపడిపోయి చచ్చినంత పనయేది నాకు. ఇంకోటికూడా చెప్పాను ఈయనతో. మరి అదెంతవరకు నిజం అవుతుందో" అంది అనుమానంగా గోపాలరావు వంక చూస్తూ.

"ఇదీ నిజమే అవుతుంది. నువ్వు చెప్పడం, అది నా పట్ల నిజం కాకపోవడమూనా?" అన్నాడు గోపాలరావు నవ్వుతూ.

"వెరీగుడ్. ఏమండీ నేను చెప్పింది గుర్తుందా—మా మావయ్య ఇప్పుడే వచ్చి ఉంటాడు పెళ్ళికి. ప్రళయం వచ్చినా రాత్రి మాత్రం చస్తే వచ్చి ఉండడు. ఎప్పుడు, ఎవరికి పెళ్ళి జరిగినా మా మావయ్య దృష్టిలో మాత్రం అదిఉదయమే జరుగుతుంది. అంటే తను మాత్రం ఉదయం పూటనే వస్తాడు," అని నవ్వి- "మన పెళ్ళికి అందుకే రాలేదు. నిశిరాత్రప్పుడు పెట్టించారు ముహూర్తం కొంపలంటుకున్నట్లు" అంది.

"నేనేం చేయను? చెప్పకపోయావూ పట్టపగలు పది గంటలకి ముహూర్తం పెట్టమని.... నిద్రపోయిందండీ తను పెళ్ళి పీటలమీద, నేను లేపాను.

అదన్నమాట ఆ ముహూర్తం మీది కోపం



గోపాలరావు నవ్వేశాడు "నిజంగా నిద్రపోయావా జానీ-జానకీ."

"ఆయన మాటలకేం. ఆ పురోహితుడ్ని ఒకటే విసుక్కోవడం" త్వరగా కానీయండి నేవెళ్ళి పడుకోవాలి. చదువుకునే రోజుల్లోనే నిద్రకి ఆగేవాడినికాను" అంటూ. సరేగాని ఎప్పుడొచ్చావింతకీ నువ్వు?" అంది జానకి అతని సమాధానం కోసం అతని ముఖంవంక చూస్తూ.

గోపాలరావు నవ్వాడు. "ఉదయమే వచ్చాను. వస్తూనే ఈ పుస్తకం పుచ్చుకుని కూర్చున్నాను."

"సక్సెస్. అయితే నువ్వేమీ మారలేదన్నమాట. బై దిబై. మా అర్ధ శరీరాన్ని నువ్వు చూడలేదు కదూ- ఈయనే."

"పావు గంటనుంచి మాట్లాడుతూ ఇప్పుడా పరిచయం?.... అయినా నీ పక్కన నిలబడి ఉంటే అర్థమయిపోలా- నీ రాముడని "

"నో ఈయన పేరు నాగేంద్రనాధ్."

"నేను తనకి మేనమామనండి పేరు గోపాలరావు."

"సరే సగం పనితప్పించావన్నమాట. కథలు. నవలలు రాస్తాడండి.... మా ఆయనకివేం పట్టవు మావయ్యా. దేవులపల్లి కృష్ణశాస్త్రి గారి పేరు చెప్పినా ఆయనెవరు అని అడుగుతారు. ఇంక నీ పేరేమి తెలుస్తుంది? అదండీ విషయం."

"నువ్వూ ఇప్పుడే వచ్చావు కదూ." అని అడిగి-"ఇప్పుడు మీ ఆవిడ్ని గురించి చెబుతాను వినండి మాస్టారూ. రాత్రి మీ ప్రాణం తీసి బస్టాండుకి తీసుకొచ్చి ఉంటుంది. తను అనుకున్న బస్సులో ఖాళీ ఉండి ఉండదు. తరువాత బస్సుకి వెడదామని మీరెంత బ్రతిమాలినా ససేమిరా అని వినకుండా ఇంటికి తీసుకుపోయి మళ్ళీ ఈ రోజు ఫస్టు బస్‌కి తీసుకొచ్చి ఉంటుంది. ఇందుకోసం తను ఎంతో చీకటితో లేచి మిమ్మల్ని లేపి ఉంటుంది. అవునా?" అన్నాడు గోపాలరావు.

"చాలా కరెక్ట్‌గా చెప్పారుసుమా మీరు! మాతో పాటు ఉన్నట్లుగా చెప్పారు."

నవ్వేశాడు గోపాలరావు. "ఇంకా చెబుతాను. ఫస్టుడే ఫస్టుషోకి మీరు టిక్కెట్లు తెస్తేసరి లేకపోతే ఇక ఆ సినిమాకి రాదు, అవునా?"



నవ్వాడు అతను. "అవును జానీ, నిన్ను గురించి నా కన్నా మావయ్య గారికే బాగా తెలుసులాగుందే!....రియల్లీ, మీరు చెప్పినదంతా కరెక్టండి! ఎంత బతిమాలినా తరువాత ఇక ఆ సినిమాకి రాదు. నేను ఒంటరిగా పోవాలిసిందే!"

"రవికాంచనిచో," అని ఒక నానుడి ఉంది లెండి.... అవునుగాని రావడమే మా మావయ్య దగ్గరకొచ్చేశాం. వెళ్ళి మా నాన్నగారికి కనబడండి. నేనిప్పుడే వచ్చేస్తాను-మావయ్యతో ఒక్క మాట మాట్లాడి" అంది జానకి.

అతను గబగబ వెళ్ళిపోయాడు. "నిన్ను చూసి హడలిపోయినట్లున్నారుమా ఆయన. 'రాసింది చదివేరా' అనో, 'చదువుతాను వింటారా?' అనో ప్రాణం తీస్తావని భయం లాగుంది. సరేగాని మావయ్యా, నాకూ కొంచెం పనుంది అవతల. మళ్ళీ కాసేపట్లో వస్తాను. ఎటూ నేను వెళ్ళాక నన్ను గురించే ఆలోచిస్తావు కనుక నేను వేరే చెప్పవసరం లేదు ఆలోచించమని."

గోపాలరావు నవ్వేడు. "ఏమంతధీమా- నిన్ను గురించే ఆలోచిస్తానని!" "అదంతే రూలు, పోనీ, ఆలోచించడం వలన నీకు లాభం చేకూరుతుంది. అందుకయినా ఆలోచించు. కథావస్తువునిస్తాను" అని నవ్వి "ఏం లేదు మావయ్యా నేను వెళ్ళేముందు నీకు కథకి మంచి మలుపు నిస్తాను. రాద్దుపుగాని. మరి నేవస్తాను. శ్రీవారి చిటికిన వేలు పుచ్చుకోవాలి పోయి-ధర్మపత్నిని కదా!" అంటూనే ఎలా వచ్చిందో అలానే వెళ్ళిపోయింది జానకి.

ఆమె వెళ్ళినవైపే చూస్తుండిపోయాడు గోపాలరావు. "జానకి ఏమీ మారలేదు" అనుకున్నాడు. ఆ అనుకోవడంలో తను మారాదన్న గుర్తింపుంది. అందుక్కారణం తను చేసిన పొరపాటు. సరిగ్గా ఏడ్నర్ధం క్రితం చేశాడా పొరపాటు.

పెళ్ళి సంబంధం చూసేందుకు ఏలూరు వెడుతూ విజయవాడ వెళ్ళాడు తను. అక్కడ "అక్కయ్యని వెంటబెట్టుకుని వెళ్ళి అమ్మాయిని చూడమని, తరువాత అవసరమయితే మిగిలినవాళ్ళు చూస్తామని" నాన్నగారి ఆర్డరు.

వెళ్ళివెళ్ళగానేఅందరూ బయలుదేరారు జానకి తప్ప. "అదేమిటి జానీ, నువ్వు రావంటుందేమిటి మీ అమ్మ" అనడిగారు

# చచ్చిన శవం

పన్నెండు మీద నిలవలేక ముల్లు
హఠాత్తుగా జారి పడుతుంది
భళ్ళున తెల్లవారుతుంది
ప్రశాంతంగా నిద్రపోయేవారికి.
ఈలోగా
సెకండ్లని అడుగుల్తో కొలిచి
మంచునంతా మనసులో కింకించుకొని
మెల్లగా
నిమిషానికో నిషా దాన్ననుభవిస్తో
వీధి కొళాయిలన్నీ వేకువ కోసం తిప్పి
నడుస్తూ
గంటకొక గోనెనంచీ చెత్త కాయితాల
బుట్టదాఖలా అనుబంధాల్ని ఏరుకొంటూ
ఆశగా
ఎవరేనా ఏదేనా పిలిచి పెట్టకపోయినా
తినలేక పారేసిందేమైనా దొరకదా అని
చూస్తోంటే
మా కంటే నికృష్టుడొకడు కన్పించాడు
నాకూ శివారెడ్డికీ ఓ రాత్రి నియోన్ దీపాల కింద
మూర్ఛలో
ఉన్నాడో ఏమోగాని నోటి నిండా చొంగ
దేనినీ చూడలేక లోపలికి తిరిగిపోయిన కళ్ళు
ఆకలిని
బండ బూతులు తిట్టి ఆగిపోయిన పెదాలు
చెడ్డీలో ఎండి ఆరి పోయిన దేహ మాలిన్యం
సిగ్గుచేటు
మన కవిత్వాలు పద శివారెడ్డీ దీనికంటే
మన దృశ్యాదృశ్యాల మసక చీకటి బారే నయం
అని
పారిపోయాం ఎవరేమ్మాట్లాడినా ఒట్టే
తీరా వెళ్తే బ్లూమౌంటెన్నూ కట్టేసారా సమయానికి
అకసాన
గీచాడెవడో బొగ్గూ చాక్‌పీస్‌తో ఓ చిత్రం
మూర్ఛిల్లిన భిక్షగాడి చిత్రాన్ని ముండమోసిన
శారదాకాశాన.

—వి. మోహన్‌ప్రసాద్

జానకిని తను.

ముఖం ముడుచుకొని కూర్చునుంది జానకి "రాను. నాకుమనసు బాగుండలేదు.. అయినా ఇప్పుడీ రోజు వెళ్ళి ఆవిడ నెవర్నో చూడకపోతే నీకయినా కొంప లంటుకు పోతాయా?" అంది.

"నా క్కాకపోయినా ఆవిడకి అంటు కుంటాయనుకుంటా. ఒకింటిదయేందుకు తొందరపడుతోందిట. ఆవిడ బి.ఏ. నువ్వు ఇంటరూ—ఇద్దరూ కాలేజి విద్యార్థినులు కదా! ఏమయినా ప్రశ్నలు వేస్తారని. పద పద" అన్నాడు.

"నేనురాను. అదంతే!"

తనకి తెలుసు—జానకి ఎంత పట్టుదల గల మనిషో!

తిరిగి వచ్చే సరికి మామూలు మని షయిపోయింది. "ఎలా ఉందో అడుగు తావా, ఇంకా కోపమేనా?" అన్నాడు తను నవ్వుతూ.

"ఇంకా ఎందుకు— అవవలసిందేదో అయే పోయిందిగా! చూసి వచ్చావుగా' బాగుందా? ఫొటో తెచ్చావా?" అంది ఏదో రాసుకుంటూనే.

"చాలా బాగుంది. కాని నేనే వద్ద న్నాను."

"అదేం?" అంది గభాలున తలెత్తి.

"అత్యాధునిక యువతులంటే నాకు భయం!"

పకపక నవ్వి "పెళ్ళి చూపులేమిటి నాన్సెన్స్! అందా?" అంది జానకి.

"అలా అంటే అక్కడే తన్ని ఉండే వాడిని. 'చూద్దురుగాని రండి' అన్నాక కాదనేందుకు ఆ అమ్మాయెవరు?"

"సర్లె. ఏం జరిగిందో నువ్వుచెప్పవే అమ్మా" అంది విసిగిపోయి.

"అంత కుతూహలం ఉన్న దానివి వెంట రాలేకపోయావూ?"

"అప్పుడు రావద్దనుకున్నాను. అదంతే. ఇప్పుడయినా ఇష్టం ఉంటే చెప్పండి. లేకపోతే మానేయండి".

"మీకు కట్నం ఎందుకివ్వాలి" అనడి గింది నన్నా అమ్మాయి" అన్నాను.

"అమ్మో అంతమాటే మగ మహా రాజుని! నువ్వేమన్నావు?"

"ఉద్యోగం మానేస్తాను. అప్పుడు పైసా కట్నం లేకుండా చేసుకుంటాను సిద్ధ మేనా?" అన్నాను.

"అసలేం జరిగిందండి మావయ్యగారు" అంది– చేస్తున్న పని పూర్తిగా ఆపేసి నా వంక తిరుగుతూ.

"అలా కూర్చో. అడిగేవారికి కుతూహలం లేకపోతే చెప్పేవారికి ఉండదు. పిల్ల చాలా బాగుంది. చదువుకున్నది. చేసేసుకుందామని నిర్ణయించుకున్నాను."

"ఉంగరం తీసి చేతికి పెట్టెయ్యబోయావు?"

"అనుకున్నాను. ఇంతలో వాళ్ళు వాళ్ళంతా బయటికి పోతూ "అమ్మాయితో ఏమయినా మాట్లాడాలంటే మాట్లాడండి" అన్నారు. అదే వాళ్ళు చేసినపొరపాటు. నేను నవ్వుతూ అన్నానా అమ్మాయితో– "చదువుకున్నదానివి నిన్నిలా సంతలో చూసినట్లు చూడడం తప్పు. కాని ఇంతకన్నమార్గం లేదుమనదేశంలో. నేను చేసిన ఈ 'తప్పు'కి ప్రతిఫలంగా నన్నేమయినా అడుగు చెపుతాను" అని.

"మీకు కట్నం ఎందుకివ్వాలి మా నాన్న?" అంది సూటిగా.

"పుచ్చుకోవాలని ఇప్పటిదాకా అనుకోవడం లేదు నేను. కాని నువ్వా మాట అన్నాక తీసుకోవాలని నిర్ణయించుకుంటున్నాను. అదీ నేను చేసే ఇంజనీరు ఉద్యోగానికి. నేను వేసుకుని తిరిగే జీపులో ముందు సీట్లో నువ్వు కూర్చునేందుకు" అన్నాను.

"నా కాసీటు అక్కరలేదు" అంది.

"అక్కరలేనప్పుడు ఇంజనీరు సంబంధమే వెతకనక్కరలేదు. ఉద్యోగానికి రాజీనామా ఇస్తాను ఈ క్షణంలో. నీలాంటదానిని చూస్తూ కాలం గడిపేయగలను— నన్ను చూస్తూ నువ్వు కాలం గడపగలనంటే అప్పుడు కట్నమూ వద్దు" అన్నాను నవ్వుతూ.

తనేం మాట్లాడలేదు.

"మరి నా ఉద్యోగమూ కావాలి. ఉట్టి గోపాలరావు పనికిరాడు. అవునా?.... ఆడపిల్లలు కట్నాల గురించి ఆందోళన చేసే బదులు తండ్రి ఆస్తిలో వాటాకోసం ఆందోళన చేయడం మంచిది. మీ నాన్న ఆస్తిలో భాగం ఇవ్వమని ఎందుకడగలేవు? ఆయన సంతానం కాదా నువ్వు. —సారీ, "మీరు". 'నువ్వు' అనే ఆ హక్కుని తీసుకోవడం లేదు నేను" అని లేచొచ్చేశాను."

"అంటే?"

"అంటే- సంబంధం వదిలేశాము అని."

"నచ్చిందన్నావుగా?"

"నచ్చింది!"

"పురుషాహంకారం. ఆ మాట అడిగిందనేగా?"

నవ్వేశాను.

"తెలివితక్కువది. అయినా తనకెందుకు.... నువ్వు చెప్పిందీ రైటే మావయ్యా- అమ్మోయ్. మావయ్య చెప్పింది విన్నావుగా. నాకూ ఆస్తిలో వాటా ఇవ్వాలి మరి."

"పోట్లాడి తీసుకో. తప్పులేదు" అన్నాను నవ్వుతూ.

"ముందు నాకు ఇమ్మనవే మీ మావయ్యని" అంది అక్కయ్య. అందరం నవ్వేశాము.

అంత అందమయిన అమ్మాయిని ఒప్పుకోనందుకు అందరూ తనని తిట్టారు.

మరోసారి మరో పెళ్ళి చూపులకి కూడా ఇలాగే రమ్మంటే "రానుగాని. మూసీ చూడగానే వచ్చి నాకే చెప్పాలి ఎలా ఉందో. ఆ అమ్మాయి నచ్చితే ముందుగా నువ్వామాట నాకు చెప్పాలి. నేనే బయటపెడతానన్న మాట!" అంది.


అందుకే తిరిగి వస్తూనే "జానకేదక్కయ్యా" అనడిగాను తను.


"ఏమోరా. పొద్దున్న అలిగింది! ఇంకా ఆ అలక తీరలేదు లాగుంది. గదిలో పడుకునుందో, చదువుతోందో తెలియదు. అయినా చచ్చిపోతున్నాంరా బాబూ! అన్నీ మొట్టమొదట తనకే జరగాలి అంటే నలుగురు పిల్లలున్న ఇంట్లో ఎలా? బాత్‌రూంలో ముందుస్నానం తను చేయాలి. సబ్బు కొత్తది తీస్తే ముందు తను రుద్దుకోవాలి. ఛ. ఛ. కష్టంరా నాయనా ఇటువంటి వాళ్ళతో" అంది అక్కయ్య.

అంతలో అక్కడి కొచ్చిన జానకిని చూసి తను "అదృష్టవంతురాలివి జానకీ. దేశానికి తూర్పు తీరంలో ఉన్నావు. బొంబే వైపు ఉంటే ఇబ్బంది అయేది" అన్నాడు.

"అదెందుకుట?" అంది జానకి అనుమానంగా.

"సూర్యోదయం ముందుగా మనకే



అవుతుంది దేశంలో. ఆ తరువాతనే మిగిలిన వాళ్ళకి".

"అతను మావయ్యోయ్ కరెక్ట్. నాకు తోచలేదు సుమా! సరేగాని ముందు నీ పెళ్ళి చూపుల కబుర్లు చెప్పవూ? రా, రా గదిలో కూర్చుందాం. అమ్మా కాఫీలు పంపవే– ఫస్ట్ ఫిల్టర్.... వెళ్ళిన పని కాయా, పండా మావయ్యా?"

"కాయే!"

"థాంక్ గాడ్! నీ నుంచి మరో పెళ్ళి చూపుల కథ వినచ్చునన్న మాట. చెప్పు చెప్పు" అంది ఉత్సాహంగా.

"నేను చూసిన అమ్మాయి ఏమీ బాగుండలేదు. ఇంటి పనులు బాగా చేస్తుందట. అయితే ఈ అమ్మాయి చెల్లెలు మాత్రం చాలా బాగుంది. అద్భుతం అనుకో".

"తననే చేసుకో మనబోయావు–ఎవరయితే నీకేం?"

"భలేదానివి. తనే వచ్చి నన్నడిగింది!"

"ఏమని? చేసుకోమనా?"

"వాళ్ళక్కయ్యని చేసుకోమని!"

"నువ్వేమన్నావు? అసలు తనెలా అడిగింది? వివరించదగున్."

నవ్వాడు తను "మీతో రెండు నిముషాలు మాట్లాడాలండి" అంది పెళ్ళి చూపులవగానే. అంతవరకు నాకు తను కనబడలేదు. వాళ్ళక్కని చూసి విరక్తి పుట్టిన నాకు ఆ అమ్మాయిని చూడగానే మతిపోయింది-ఇద్దరిలో ఎంత వ్యత్యాసమా అని. చాలా అందమయినది."

"మాట్లాడండి" అన్నాను.

"మీరు మరోలా మరోలా అనుకోకూడదు" అంది.


"అనుకుంటానంటే చెప్పడం మానతారా? ఖర్మ ఎలా ఉంటే అలా జరుగుతుంది. మన కర్తవ్యం మనం చేయాలి. మీ కర్తవ్యం చెప్పడమే అయితే చెప్పండి."

నవ్వింది. నవ్వితే ఇంకా అందంగా ఉందనుకున్నాను. "మీరు మా అక్కయ్యను కాదన కూడదు."

"కాదనబోతున్నానని మీకెలాతెలుసు?"

"మీ ముఖం చూస్తే తెలియడం లేదా? ఒక్కసారి చూశారు మీరు దానివంక అంతే. మళ్ళీ తల అటు తిప్పలేదు."

"మీ కెలా తెలుసు? నేను మిమ్మల్ని



## ఉదయగానం

స్వర పేటికని అమ్మేసి
నిశ్శబ్దాన్ని కొనుక్కోవడం
తెలివైన పని అనుకోను నేను.
వేసవి ఉదయం
చెవులు విప్పగానే
చెట్టుమీద పిట్టలన్నీ
కవి కమ్మని నన్ను ప్రోత్సహిస్తాయి
గొంతులో నిప్పు రాజేసి
పెదవులు మాత్రం బిగించుకుని
కదలకుండా పడుక్కుంటాను
పదాలేవో పచన మౌతుంటాయి లోపల
మడత పెట్టిన ఇస్త్రీ బట్టల్లా
ముడుచుకు పడుకున్న భావాల్ని
జుట్టుపట్టుకు ఈడ్చుకొచ్చి
దుశ్శాసించడం నాకు ఇష్టం లేదు
జాంకాయ పలకబారడం కోసం
చెట్టుకేసి చూస్తూ కూర్చునే కుర్రాళ్ళా
ఓర్పుగా నిరీక్షిస్తాను.
ఉన్నట్టుండి రేడియోలో
సైగల్ గొంతులా
తలలో ఇమేజ్ ఒకటి
క్రమంగా వికసిస్తుంది.
నేను మత్తు దుప్పటి విదిలించి
లేచి కూచుని
కవి నౌతాను.

—కె. గోదావరి శర్మ

చూడడం ఇదే మొదలు."

"నాకు కాదు. మా అక్క పెళ్ళి చూపుల టైంలో నన్ను బయటికి రానీయరు."

"చాలా అయాయన్నమాట!"

"అయ్యాయి"

ఎవాళ్ళందరికీ మీరీమాటే-అదే-"మా అక్కను కాదన కండి" అని చెప్పారా?"

"లేదు."

"ఎందువలన?"

"మీ సంబంధం పోనీయకూడదనిపించి మీకు మాత్రమే చెప్పాను."

"ఎందువలన?"

"మీరు నచ్చారు కనుక!"

"మీకూ్కడానా?"

"నాకూ్కడా....అంటే ఐ మీన్, మా అక్కకి కాబోయే భర్తగా!"

నేను నవ్వి "నేను మీ వంక ఎలా చూస్తున్నాను?" అనడిగాను.

"కన్నార్పకుండా!"

"గడుసువారు."

"గడుసు కాదు. నన్నందరూ అలానే చూస్తారు."

"ఒకమాటచెబుతాను,ఏమనుకోరుగదా!"

"నేను కోరిన వరం ఇస్తే ఎన్ని చెప్పినా ఏమీ అనుకోను."

"నేను కోరిన వరం మీరు నా కెందుకివ్వకూడదు?" అని నవ్వి "మీరయితే పైసా కట్నం లేకుండా చేసుకుంటాను" అన్నాను.

"మాటమార్చకండి ప్లీజ్.మా అక్కని చేసుకోండి. అదిమంచిది. చాలా అమాయకురాలు. ఇంటి పనులన్నీ చేస్తుందండి."

"ఏమీ చేయకపోయినా నాకు అన్నీ చేసేందుకు మనుషులున్నారు. నేను ఆఫీసర్ని నా పక్కన కూర్చునేందుకు అందమయిన భార్య కావాలి. మీరయితే- అన్ని ఖర్చులూ నేనే పెట్టుకుంటాను."

"మీకు ఎంత కట్నం.... నేనిలా అడుగుతున్నందుకు ఏమీ అనుకోకండి. మీకు కట్నం ఎంత ఇస్తారని అనుకుంటున్నారు ఈ పెళ్ళి మార్కెట్‌లో? నాకు చెప్పొద్దు లెండి. మీరు మనసులో అనుకోండి చాలు," అంది.

ఆ అమ్మాయి ముఖమంతా ఎర్రపడిపోతోంది నన్నెలాగయినా ఒప్పించాలన్న తాపత్రయం కనబడుతోంది.

నేను నవ్వి "సరే, అనుకున్నాను" అన్నాను.

"దాన్ని రెట్టింపు చేయండి."

"సరే చేశాను."

"దానికిమరో అయిదువేలు కలపండి."

"కలిపాను."

"మీ మీద ప్రమాణం చేసి చెబుతున్నాను. అంత కట్నం ఇప్పిస్తాను మా అక్కను చేసుకుంటే" అంది, కళ్ళనీళ్ళు తక్కువగా.

"ఎలాఇప్పిస్తారు అంత?"

"నాకోసం మా డాడీ కొంత కట్నం ఇస్తారు గద,అదికూడా మీకే ఇప్పిస్తాను."

"మరి మీ సంగతో?"

ఆమె క్షణం అగి "నన్నెవరయినా చేసుకుంటారు" అందినిదానంగా.

నేన్నవ్వి "ఎవరో ఎందుకు, నేనే చేసుకుంటానన్నానుకదా!" అన్నాను.

తను సిగ్గుపడింది. కళ్ళనుంచి బొట్లు పడుతున్నాయి. "నన్ను చేసుకునేందుకు ఒకతను సిద్ధంగా ఉన్నాడండి. బంధువవుతారన్న ఆశతో అన్నీ చేప్పేస్తున్నాను. నాకు మా అక్క అంటే చాలా ప్రేమ సార్,అది చాలాఅమాయకురాలు సార్"- అంతే ఇక తను ఆపుకోలేక ఏడవడం మొదలుపెట్టింది.

నాకు జాలేసింది"చూడు మిస్. నీ పేరు నాకు తెలియదు. నీలాంటిది ఇంతగా బతిమాలినా నేను అంగీకరించనందుకు ఏమీ అనుకోకు. ఇది జీవితం. ఒక అందమయిన అమ్మాయిని చూసి త్యాగం చేయిలేను. అయామ్ సారీ అని గబగబ వచ్చేశాను "

"భలేదే.ఆఅమ్మాయికి పెళ్ళయితేగాని తను చేసుకోకూడదు కదా,అందుకనేమో" అంది జానకి.

"ఛ, ఛ. అది కాదు. నిజంగానే వాళ్ళక్క అంటే చాలా ప్రేమలా కనబడింది."

"మొత్తానికి ఇంకా నీ బ్రహ్మచర్యం వదల లేవన్న మాట!" అని నవ్వి "అమ్మా, టిఫిన్ కూడా ఏమయినా పంపవే" అని అరిచింది జానకి.

తాను ఆ తరువాత పెళ్ళి చూపుల తతంగాలతో విసిగిపోయి ఇంటిలోని వాళ్ళకి ఒకటే పద్ధతి చెప్పేశాడు. ముందు వాళ్ళంతా చూసేయడం, పిల్ల బాగుందని వాళ్ళందరూ ఏకగ్రీవంగా అభిప్రాయ పడితే తనకి విషయం తెలియచేయటం. అప్పుడు తను వెళ్ళి చూస్తానని!

కొన్నాళ్ళకి అదే విధంగా తనకి ఉత్తరం వచ్చింది ఫలానా చోట ఫలానా వారి అమ్మాయి అప్సరసలనందరినీ కలిపి తయారుచేసినట్లుగా ఉందని,కనుక చూసి రమ్మనమని! తనకు ఇందులో ఆనందం కలిగించేది ఏమంటే ఆ ఊళ్ళోనే జానకి హాస్టల్లో ఉండి చదువుకుంటూ వుండగా- 'ఈసారి జానకినే వెంటేసుకుని వెళ్ళచ్చు ఈ చూపులకి. ఆడవాళ్ళు చూసే చూపు వేరే కదా!' అనుకుని బయలుదేరాడు.

ఆ ఊళ్ళో దిగడమే తాను ఆఫీసుకు వెళ్ళి జీపు ఒకటి "సాయంత్రం దాకా నా కిందనేఉంటుం"దని చెప్పితీసుకున్నాడు. నేరుగా జానకి ఉండే హాస్టలుకి వెళ్ళాడు. అక్కడి వార్డెన్ గదిలోకి వెళ్ళి విజిటింగ్ కార్డ్ ఇచ్చి"నాకు మేనకోడలు అవుతుంది జానకి. పిలిపించండి"అన్నాడు ఆవిడతో.

వార్డెన్ తన వంక ప్రశంసాపూర్వకంగా చూసి తనే లోపలికి వెళ్ళి జానకిని వెంటబెట్టుకుని వచ్చింది. దగ్గరవుతుండగా ఆమె జానకితో అంటున్న మాటలు తనకి వినబడ్డాయి. "కంగ్రాట్స్ జానకీ ఫస్టు క్లాసయిన మావయ్య ఉన్నారన్న మాట. సో, పెళ్ళి సమస్య కాదు నీకు" అంటోంది.


తను ఆశ్చర్యపోయాడు నమ్మలేనట్లుగా ఉన్నాయి తనకా మాటలు. జానకి వంక చూశాడు. జీవితంలో మొట్టమొదటిసారిగా మరోలా. నిండు స్త్రీ లా కనబడింది తన కంటికి!

మళ్ళి చూశాడు. మళ్లీమళ్లీ చూశాడు. అలాచూస్తూనేవున్నాడు."ఏం మావయ్యా, రథం నీదేనా" అంది జీపు వంక చూస్తూ.

తను తేరుకుని "అవును జానీ, ఈ వూరు ఆఫీసు వారిది" అన్నాడు తను. ఆమెతో మాట్లాడుతున్నా కొత్తగా వుంది తనకి- జీవితంలో మొట్టమొదటసారిగా!

కలిసి నడుస్తున్నారు జీపువైపు. దూరంగా, దూరంగా చిన్న చిన్న గ్రూప్స్‌గా కూర్చుని ఉన్న వాళ్ళంతా తమిద్దరినీ చూస్తున్నారని గ్రహించాడు తాను. "మేడ్ ఫర్ ఈచ్ అదర్"అంటోంది ఒకమ్మాయి మెల్లిగా. "జానకిగారు లక్కీ- ఎప్పుడూ చెప్పింది కాదు. ఇంజనీరుట






గద!" అంటోంది మరో అమ్మాయి.

ఇదంతా వింతగా ఉంది తనకు. తనెప్పుడూ జానకిని 'ఆడదాని'గా చూడలేదు. ఇప్పటివరకూ కారణం తామిద్దరిమధ్యన వయసుల్లో తేడా చాలా ఉండటమే! ఆ తేడా చూసేందుకు ఏమీ కనిపించదన్న విషయం గ్రహించింది తానిప్పుడే! అందుకే జానకిని సరికొత్త దృష్టితో చూస్తున్నాడు. 'అవును ఎవరెవరినో చూశాడు తను కొంగున బంగారాన్ని పెట్టుకుని! జానకే తనదయితే అంతకన్న కావలసినిదేముంది గుడ్డివాడు తను.'

జీపు దగ్గరకు వచ్చేశారు.

"ఏమిటి మావయ్యా మాట్లాడవేం?" అంది బుజం మీద తట్టి.

తనకి ఒళ్ళు పులకరించినట్లయింది. 'ఎవ్వరూ కాదు. జానకే నా మనిషి.జానకి నా మనిషి' అనుకున్నాడు. వెంటనే ఎక్కడలేని ఉత్సాహం వచ్చేసింది. ఆమె పమిట రెండువైపులా పట్టుకుని తల మీదికి లాగుతూ "ఎంత, నల్లబడి పోయావు" అని నవ్వారు.

"నువ్వూ నలుపేగా!" అందిజానకి.

"నేను సాయంత్రం అయిదుకల్లా వచ్చేస్తాను. ఇద్దరం కలిసి సముద్రం దగ్గరకు వెళ్ళి ఆ తరువాత సినిమాకి వెళ్ళి ఆ తరువాత ఇక్కడ నిన్ను దించి నేను వెళ్ళిపోతాను రెడీగా ఉండు. చక్కగా తయారవాలి" అన్నాడు జీపెక్కుతూ.

"ఇప్పుడు చక్కగా లేనా?"

"ఎప్పుడూ చక్కగానే ఉంటావు- బంగారంలా! మరికాస్త.... ఈవెనింగ్ ఫైవ్!" జీపు రివ్వున దూసుకుపోయింది శరవేగంతో, మనోవేగంతో!

తనకి అంతా వింతగా ఉంది "ఎందుకు జానకిని ఇన్నాళ్ళుగా ఈ దృష్టితో చూడలేకపోయాడు తను" అన్నదే వింతగా ఉంది తనకి.

పెళ్ళికూతురు వచ్చి కూర్చోవడం అవేమీ తనకి తెలియవు.

"ఏమయినా మాట్లాడిస్తారా?" అనడి గారు ఎవరో.

"అక్కరలేదు"అన్నాడు తను ముక్తసరిగా. వెళ్ళిపోయి జానకితో చెప్పాలి, "ఇంకెవ్వరూ అక్కరలేదు నువ్వేకావాలి నీకు నేను, నాకు నువ్వు" అని.

టైము చూసుకుని లేచి నిలబడ్డాడు.

అయిదుకి పావుగంట ఉంది. ఎదురుగా ఉన్నవాళ్ళ ముఖాల్లో కనబడిన ఖంగారు చూసి అప్పుడు గ్రహించాడు తను- ఇంకా పెళ్ళిచూపుల తతంగం పూర్తి కాలేదని. "సారీ, అవతల నాకు కాన్ఫరెన్స్ ఉందండి. అందువల్ల" అంటూనే బయటకి వచ్చేశాడు.

"టిఫిన్, కాఫీ రెండూ అయాయి" అని అరిచారెవరో వెనుకనుంచి. "అక్కరలేదు" అని జీప్ ఎక్కాడు.

ఒక పెద్దాయనఎవరో పరుగెత్తుకుంటూ వచ్చి అడిగారు: "బాబూనాన్నగారి దగ్గరకు వెళ్ళమంటారా?" అని.

"ఎందుకు? " అడిగాడు తను అర్థం కాక.

"ముహూర్తాలు పెట్టుకునేందుకు!"

"అక్కర లేదు. ఇది ఇక్కడితో సరి!" అంటూనే జీప్ దూకించాడు.

అయిదుకల్లా హాస్టల్ ముందు ఆగింది. జానకి వచ్చి ఎక్కింది ఫ్రంట్ సీట్లో చాలా సార్లు కూచ్చుంది ఆ రకంగా. కాని ఇప్పుడు అందులో ఏదో కొత్తదనం కనబడింది తనకి. తన జీవితానికి, ఉద్యోగానికి నిండుతనం వచ్చింది.

"మళ్ళీ పెళ్ళిచూపుల కొచ్చావా మావయ్యా?" అడిగింది.

"ఛ. కాన్ఫరెన్సుకి. ఇక పెళ్ళిచూపు ల్లేవు" అన్నాడు తాను.

"అదేం?"

సమాధానం చెప్పకుండా బట్టలకొట్టు ముందాపాడు జీప్.

"ఇదేమిటి?"

"నీకు చీర కొందామని!"

"అదెందుకట?"

"నీ బర్త్‌డేకి అనుకో."

"ఇప్పుడు కాదే!"

"వచ్చినప్పుడు కట్టుకుందూ!"

వాళ్ళు వేసిన చీరల కుప్పలోంచి తనే ఏరాడు చీర "ఇది బాగుంటుంది—నీ వంటికి మాచవుతుంది" అన్నాడు.

"ఫైన్. చాలా మంచి సెలెక్షన్!" అంది జానకి.

"అమ్మగారికి చీరతోపాటు మీకు మరి వద్దాసార్?" అడిగాడు సేల్స్‌మన్.

"మందేముందండి, పర్సు పుచ్చుకుని డబ్బివ్వడం వరకే: జాకెట్ నువ్వు సెలెక్ట్ చేయి జానీ" అన్నాడు తాను.

"అమ్మగారు వస్తుంటారు సార్ మా షాపుకి. మిమ్మల్ని చూడటం ఇదే మొదలు" అన్నాడు షాప్ మానేజరు.

"ఇక వస్తుంటాను. మరి తప్పుతుందా" అన్నాడు తను.

జానకి తనవంక ఒకసారి చూసి మాట్లాడకుండా వెళ్ళి జీపెక్కింది.

"నీ కోసం ఇందాకే టిక్కెట్లు తెప్పించాను. ఈ సినిమా ఈ రోజే మొదలు" అన్నాడు తను.

"నీకు తెలుసునుగదా మొదటి రోజు మొదటి ఆట దాటితే రానని" నవ్వింది జానకి.

సినిమా హాలులో కూడా చాలామంది తమ ఇద్దరి వంకనే చూడటం తనకి చాలా గర్వంగా అనిపించింది. అవును మరి. జానకి చాలా అందమయింది. తాను ఆరడుగులవాడు, ఇద్దరూ కలిస్తే చాలా మంచి కలయిక అని తాను గ్రహించింది ఈనాడే!

సినిమా అయాక వస్తూవస్తూ హాస్టలుకి దగ్గరగా ఆపాడు జీప్, "జానకీ, నీతో ఒకమాట చెప్పాలి" అన్నాడు తను.

గభాలున తలెత్తి "చెప్పు" అంది.

"నేనింకెవరినీ చూడదలుకోలేదు. పిల్లకూడా ఫిక్సయింది."

"ఎవరేం?"

"నువ్వే!"

"అదేమిటి మావయ్యా, నేనా?"

"ఔను నువ్వే!"

"సారీమావయ్యా. నువ్వేదో పొరపాటు మాట్లాడుతున్నావీ రోజు."

"లేదు జానీ, ఈ చీర మనిద్దరికీ ప్రధానం చీర అనుకో! నిన్నే చేసుకుంటాను."

క్షణం నిశ్శబ్దం తరువాత ఏడాదిక్రితం ఇటువంటి మాట అంటావేమోనని ఒళ్ళంతా కళ్ళుచేసుకుని ఎదురు చూశానని నీకు తెలుసా మావయ్యా?"

"సారీ జానీ. అప్పుడు నేననుకోలేదు."

"సారీ మావయ్యా. ఇప్పుడు నేను అనుకోవడం లేదు"

"జానకీ!" అరిచాడు తాను.

"అవును మావయ్యా, నా పేరేమిటి?"

"జానకి!"

"ఆ జానకికి భర్త ఎవరు?"

"నేనే!"

"అది కాదు సీత భర్త పేరు?"

"రాముడు."


"రాముడు సీతనిచూసేముందుఎందర్ని చూశాడు పెళ్ళి కోసం?"

"ఎవ్వరినీ చూడలేదు!"

"కరెక్ట్. నాకూఅదేకావాలి మావయ్యా. నువ్వు చాలా మందిని చూశావు. వాళ్ళు ఒప్పుకుంటే పెళ్ళాడదామనీ అనుకున్నావు. నా తీరు నీకు తెలుసు మావయ్యా. ఎవరికయినా నేను ఫస్టు ఛాయిస్ కావాలి! మొట్టమొదట నన్నే ఎన్నుకోవాలి! నన్నుమించిన లోకం వాళ్ళకి ఉండకూడదు."

"నాకూ లేదు జానకీ, నా మాట నమ్ము!"

"లేదు మావయ్యా ఎవరెవర్ని చేసుకుందామనుకున్నదీ కూడా చెప్పావు నాకు. అందుకే నీవు మొదటిసారి పెళ్ళి చూపులకి వెళుతుంటే ఎంత బాధపడ్డానో నీకు తెలియదు. ఆనాటిదాకా నా సర్వస్వం నీదేననుకున్నాను మావయ్యా. ఇప్పుడు



కాదు. నువ్వు మావయ్యవే! అంతే".

తన హృదయం తల్లడిల్లిపోయింది. "అలా అనకు జానీ, ఇన్నాళ్ళు నువ్వు నా కన్న చాలా చిన్నదానవనుకుని 'భార్య' అన్న దృష్టితో చూడలేదు. చూసేవాళ్ళకి 'ఈడూ జోడు'గాఉండదని,నిన్నన్యాయం చెసినట్లవుతుందని, ఆ ఆలోచనే రానివ్వ లేదు.కానీ ఈ రోజున విన్నాను,చూశాను- 'మనం మేడ్ ఫర్ ఈచ్ అదర్' అని. చూసే వాళ్ళకి మంచి జంటగా కనబడ తామని!"

"అంతే కానీ నువ్వంటే ప్రేమలేక కాదు జానకీ. చిన్నతనం నుంచీ నీకూ తెలుసు నువ్వంటే నాకెంత ఇష్టమో!"

జీప్‌లోంచి దిగేసిందిజానకి. "క్షమించు మావయ్యా నా తీరు నీకు తెలుసు. నా లాంటివాళ్ళు మారకపోతే సుఖపడరని తెలుసు నాకు. నిన్ను కాదని నేనెంతగా నష్టపోతానో కూడా తెలుసు నాకు. నువ్వంటే నా కెంత ఇష్టమో నీకు తెలియకపోవచ్చును."

"నేను నా మనసుతో రాజీపడలేను మావయ్యా! మొట్టమొదట నువ్వు నన్నే అడిగిఉంటే—అబ్బ,అదృష్టవంతురాలిని అయేదాన్ని నేను... వస్తా మావయ్యా గుడ్ నైట్! దిగకు నేను వెళ్ళగలను. నన్ను ఒంటరిగా వదిలెయ్" గబగబ వెళ్లిపోయింది.

జీప్ శూన్యమయిపోయింది. ఆమె కూర్చున్న చోటు తడిమాడు తను. చీర ప్యాకెట్ తగిలింది. ఉలిక్కిపడి జానకిని పిలవబోయాడు. గొంతులోంచి పిలుపు బయటపడలేదు.

జీప్ మెల్లిగా కదిలింది చీకటిలోకి.

అంతే. తను మళ్ళీ పెళ్ళి ప్రయత్నం చేయలేదు. ఎప్పుడు చేసుకుంటాడో కూడా తెలియదు. చేసుకోవాలని మాత్రం లేదు.....

"ఏం మావయ్యా" గబగబ వస్తోంది జానకి.

గోపాలరావుకి మనస్సంతా కలచి వేసినట్లయింది— వస్తున్న జానకిని చూస్తుంటే "పోతపోసిన బంగారం" అనుకున్నాడు.

దగ్గరకొచ్చి "ఇప్పుడు నీకు సమస్య నిస్తాను మావయ్యా. చూశావుగా మా ఆయన్ని" అంది.

"చూశానుగా."

"ఎలా ఉన్నారు?"

"బాగున్నాడు. మంచివాడు."

"అవునా. నా మనసు నీకు తెలిసిందే కదా! నన్ను మించిన లోకం వాళ్ళ కుండ కూడదు వగయిరా. మా ఆయనకి నా తోటిదే ఈ లోకమంతా! కనుక నా అదృష్టం బావుంది. అదే ఆయన చాలా పెద్ద 'తిరుగుబోతు', 'ఆడ పిచ్చి' గలవాడయుంటే నా లాంటి పాత్ర ఏమయ్యుం దేది? అదన్నమాట నీ కథకి ముడి సరుకు.... మరినే వస్తా మావయ్యా! ఈ జానకిని గుర్తుంచుకుంటావు కదూ!"

గుండెల్లో బాకుతో పొడిచినట్లయింది గోపాలరావుకి-అతనిమాటబయటకి రాకుండానే గబగబ వెళ్ళిపోయింది జానకి—తన ముఖం గోపాలరావుకి చూపడం తనకీ ఇష్టంలేక.

కథ తయారవడం ఎంతసేపు? ఎటువంటి పాత్రలు, ఎటువంటి పరిస్థితుల్లో ఎలా ప్రవర్తిస్తాయో కొట్టినపిండి అయిపోయింది అతనికి వ్రాసి వ్రాసి.

కథ పూర్తయ్యాక మళ్ళీ చదువుకున్నాడు. అన్నిటిలోనూ మొట్టమొదటిదానిగా ఉండాలన్న తాపత్రయం గల పాత్ర అందులోని సావిత్రి. "అసలు దేముడే నన్ను అలా పుట్టించాడు- మా అమ్మకి మొట్టమొదటి సంతానం నేను" అంటుంది. స్కూల్‌లో ఫస్టు, కాలేజీలో ఫస్టు.

వెడితే ఫస్టు దే. టిక్కెట్లు లేకపోతే మానేయడమే: అయితే ఆమెకి జీవితంలో మాత్రం పెద్ద ఎదురుదెబ్బ తగిలింది....

భర్త పెళ్ళికాని క్రితమే 'ఆడ స్నేహాలు' అలవాటు కలవాడు. 'అనుభవాలు' కలవాడు. ఇది ఆమెకి పెళ్ళయాక తెలిసింది.


చివరికి జీవితంలో సమాధానపడేందుకు అతన్ని "ఇకనుంచయినా అటువంటి తిరుగుళ్ళు మానేయమ"ని బతిమాలింది.

"నా సరదా నాది. నువ్వులేని నాటి నుంచి ఉన్న అలవాట్లు నావి! ఈనాడు నువ్వొచ్చి పొమ్మంటే పోతాయా సావిత్రీ! నీ కన్న నా అలవాట్లు సీనియర్లు" అనేశాడు నవ్వుతూనే.

ఏమన్నా అంటే "నీకే విషయంలో నయినా లోపం చేస్తుంటె చెప్పు. మగవాడు సృష్టించబడినదే బలంతో! వాడిని అదుపులో పెట్టగలననుకోవడంఅవివేకం. నా అలవాట్లే మొదటివి. తరువాతదానివే నువ్వు." అనేవాడు.

కథలోని సావిత్రి అలా "రెండవదానిగా" తన జీవితంలో రాజీపడలేకపోయింది. ఆమెకది అలవాటులేని స్థితి. ఈ ఘర్షణలో ఎప్పుడూ అతనిదే విజయం కావడం ఆమె అహాన్ని దెబ్బతీసింది.

"కనీసం నీ జీవితంలోంచి నిష్క్రమించటంలో నయినా మొదటిదానిని నవుతాను" అని రాసింది భర్తకి పెట్టిన ఉత్తరంలో. నిద్రలేచి చూసేసరికి పక్కనే శాశ్వత నిద్రలోకి వెళ్ళిపోయిన సావిత్రిని చూసి ఆమె భర్త జాలిపడ్డాడు. "పిచ్చిది. జీవించడం తెలియనిది! నేనామెకేనాడూ లోపం చేయలేదు. 'చేశానా?' అని అడిగితే తనే



చెప్పలేకపోయేది సమాధానం" అన్నాడు తన వాళ్ళతో.

"ఎంతో ప్రేమతో చూసుకునే వాడమ్మా పెళ్ళాన్ని! మగవాడన్నాక ఏవేవో సరదా లుంటాయి. మగజన్మే అంత. మగ మహారాజు. ఇప్పుడేం బావుకుంది. ఇన్ని నిద్రమాత్రలు మింగి చచ్చింది. ఏం సాధించింది?" అనుకున్నారు చుట్టు పక్కలవారు".

"పోస్టు సార్" అన్న పిలుపుతో గోపాలరావు తను రాసిన కథలోంచి బయటికి వచ్చి బయటికి వెళ్ళాడు. ఇచ్చిన కవరు మీది చేవ్రాత జానకిది! గబగబ లోపలికి వెళ్ళి చింపి ఉత్తరం బయటికి తీశాడు—

"మావయ్యకు నమస్కారం చేస్తున్నది జానకి

నీ కథ తాలూకు పత్రిక మీ వూరు కన్న మా వూరుకి ముందు వస్తుందని నీకూ తెలుసు. కనుక నా సమస్యకి పరిష్కారం రాసిన నీ కథని చదివిన తరువాతనే రాశాను ఈ ఉత్తరం.

నిజానికి మావయ్యా ఈ నీ కథకోసం చకోర పక్షిలా ఎదురు చూస్తున్నాను. సావిత్రి తన జీవితాన్ని అంతం చేసుకుంటే జాలిపడ్డాను- ఆమెమీద కాదు- నా మీద నేను!

మావయ్యా మా వారు శ్రీరాముడు కాదు. నీ పాత్ర సావిత్రి భర్తకన్న రెండు పేజీలు ఎక్కువ చదివినవారు. ఆయన వయసులోని అనుభవాల తీపి గుర్తులు నాకు ఎదురుగానే అట్టేపెట్టిన ఘనుడు! మా ఇంట్లో పనిచేసేమనిషికిఉన్న ఒక్కగానొక్క కొడుకూ మా శ్రీవారి వరప్రసాదమే! "నీ కన్న ముందువచ్చిన దానిని అన్యాయం చేయమంటావా జానకీ. నిన్ను నిరాదరణ చేస్తున్నానా చెప్పుపోనీ." ఇదీ ఆయన వాదన,

అందువల్ల- అందువలన మావయ్యా నా సమస్యకి పరిష్కారం నిన్నే అడిగాను. ఇచ్చావు. ఈ ఉత్తరం అందే టైముకి సరిగా మా ఇద్దరి శరీరాలు పోలీసుల అధీనంలో వుంటాయి— ప్రాణం లేకుండా. ఉత్తరం చదవడం ఆపకు మావయ్యా. ఖంగారు పడకు. నా భర్త శ్రీరాముడు కాదని చెప్పానుగదా. అందువల్ల ఆ సీతమ్మలాగా ఒంటరిగా భూమిలోకి పోను నేను. ఆయనతో సహా పోతాను.

చదువు. ఆపకు. మా కారులో ఎక్కుతాము. బ్రేకు పడకుండా సినిమాల్లో చూస్తున్నాం గదా, అలా ఏర్పాటు చేశాను స్టీరింగ్ దగ్గర నేనే! కారు స్పీడు పెరుగుతూ ఉంటుంది. నేను ఖంగారు పడుతుంటాను. ఆయన నన్ను తప్పుకో మంటారు. తప్పుకోను. బలవంతాన స్టీరింగ్ తీసుకునేందుకు వంగుతారు. నాకూ స్టీరింగ్‌కు మధ్యన ఆయన ఉంటారన్న మాట. అప్పుడు ఆక్సిడెంటు! పాపం ఆ క్షణంలో ఏది ఎదురు వస్తే దానికి గుద్దేస్తాను. లారీగాని, కారుగాని. అవతలి వారిని దేముడే రక్షించాలి! ముందు మా వారు పోవాలి. తరువాత నేను పోతాను.

నాదగ్గరున్న అడ్రసు నీదే మావయ్యా! నీకన్న నాకు ఎవరూ లేరు మావయ్యా ఆత్మీయులు! నీకే ఫోను చేస్తారు పోలీసులు".

"ట్రింగ్. ట్రింగ్" అని ఫోను రింగవడంతో ముచ్చెమటలు పోశాయి గోపాలరావుకి. ఉత్తరం కింద పడిపోయింది, చేతులు పట్టుతప్పాయి. బలవంతాన ఫోను తీశాడు. "హల్లో సార్, గోపాలరావుగారు, సాయంత్రం పిక్చర్‌కి మీక్కూడా టిక్కెట్ కొనేశాను" అంటున్నారు అవతల ఎవరో.

"అలాగే, అలాగే" అంటూనే పెట్టేశాడు గోపాలరావు. చెమట తుడుచుకున్నాడు. ఊపిరి అందటం లేదతనికి.

మళ్ళీ ఉత్తరం తీశాడు—

"చదవడం మానకు మావయ్యా. ఇవే నా ఆఖరి మాటలు.... ఆ రకంగా ఈ జానకి ఈ లోకంలోంచి నిష్క్రమిస్తుంది శ్రీవారితో సహా.

కాని మావయ్యా నువ్వు నీ సావిత్రి జీవితాన్ని మరోలా ముగిస్తే ఎంత బావుండేది! ఉదాహరణకి వాళ్ళ బావ దగ్గరకు వెళ్ళి "వచ్చేశాను బావా ఇక నువ్వూ, నేను ఒకటి! మనల్ని ఎవరూ విడదీయలేరు." అని ఉంటే— వచ్చి నీ తలుపు తట్టేదాన్ని కదూ!"....

తలుపు తట్టిన చప్పుడవడంతో ఒక్క అంగలో వెళ్ళి తలుపుతీశాడు గోపాలరావు.

ఎదురుగా ఉన్న పోలీసాఫీసర్ని చూసి తెల్లబోయాడు.

అతను టోపీ తీసి "సారీ సార్ గోపాలరావంటే మీరేటకదా! హైదరాబాద్ రోడ్డుమీద కారాక్సిడెంట్ అయిందండి. ఒక ఆడమనిషి. ఒక మగమనిషి— స్టీరింగ్ నొక్కుకుపోయిందండి. ఇద్దరూ. పోయారు సార్. ఆ అమ్మాయి దగ్గర మీ అడ్రసు...."

కుప్పకూలిపోయాడు గోపాలరావు.

"గొప్ప ఆక్సిడెంట్ సార్. కావాలని చేసినట్లుంది గాని...." అన్న మాటలు అతని చెవిలోకి వెళ్ళలేదు. గాలిలోనే కలిసిపోయాయి.

